సాక్షి గుంటూరు

గురువారం । 17 । జూలై । 2025



హుండీ ఆదాయం లెక్కింపు

అల్లూరు(కర్లపాలెం): స్థానిక రాజ్యలక్ష్మి సమేత లక్ష్మీ నరసింహ స్వామి ఆలయ హుండీ ఆదాయం రూ.2,17,253 వచ్చినట్లు ఈవో ఎంవీ శ్రీనివాసవర్మ తెలిపారు.



కురిసింది వాన

తాడికొండ: దాదాపు నెలకుపైగా ముఖం చాటేసిన వరుణుడు ఎట్టకేలకు కరుణ చూపాడు. బుధవారం సాయంత్రం భారీ వర్షం రైతులు సహా అందరికీ ఊరటనిచ్చింది.



దుర్గమ్మకు భారీగా హుండీ కానుకలు

ఇంద్రకీలాద్రి(విజయవాడ పశ్చిమ): దుర్గమ్మకు హుండీల ద్వారా రూ.4,37,16,236 నగదు, 395 గ్రాముల బంగారం, 9.614 కిలోల వెండి సమకూరాయని ఈఓ శీనానాయక్ తెలిపారు.

న్యూస్‌రీల్

3 వేల కిలోల ప్లాస్టిక్ కవర్లు స్వాధీనం



పొన్నూరు: పట్టణంలో నిషేధిత ప్లాస్టిక్ కవర్లు విక్రయిస్తున్న దుకాణంలో బుధవారం మున్సిపల్ అధికారులు ఆకస్మిక దాడులు నిర్వహించారు. దాదాపు మూడు వేల కిలోల ప్లాస్టిక్ కవర్లను సీజ్ చేశారు. మున్సిపల్ కమిషనర్ ముప్పాళ్ళ రమేష్ బాబు తెలిపిన వివరాల ప్రకారం 21 వార్డులోని ఓ ట్రేడర్స్‌లో విక్రయానికి ఉంచిన ప్లాస్టిక్ కవర్లను స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. యజమానికి రూ. 10 వేల జరిమానా విధించినట్లు తెలిపారు.

మైనార్టీ విద్యాసంస్థల్లో నేరుగా ప్రవేశాలు


గుంటూరు ఎడ్యుకేషన్: ఆంధ్రప్రదేశ్ రెసిడెన్షియల్ విద్యాసంస్థల ఆధ్వర్యంలో నడుపుతున్న మైనార్టీ బాల,బాలికల పాఠశాలలతోపాటు ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో ఖాళీగా ఉన్న సీట్లలో విద్యార్థులకు నేరుగా ప్రవేశాలు కల్పించనున్నారు. ఈ మేరకు కన్వీనర్ ఎం. రజని బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పొన్నూరు రోడ్డులోని మైనార్టీ బాలికల పాఠశాల, పాత గుంటూరు నందివెలుగు రోడ్డులోని బాలుర పాఠశాలలో 5,6,7,8వ తరగతులతోపాటు ఉర్దూ బాలుర జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రథమ సంవత్సరంలో ఎటువంటి ప్రవేశ పరీక్ష లేకుండా ప్రవేశం పొందవచ్చని పేర్కొన్నారు. వివరాలకు 87126 25038, 87126 25039, 87126 25073 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

సుబ్రహ్మణ్యస్వామి కల్యాణోత్సవం



నరసరావుపేటరూరల్: అల్లూరివారిపాలెం రోడ్డులోని లింగంగుంట్ల చెక్‌పోస్ట్ సమీపంలోని మానసాదేవి, సుబ్రహ్మణ్యేశ్వరస్వామి దేవస్థానంలో బుధవారం శ్రీవల్లి దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉత్సవ మూర్తులను ప్రత్యేకంగా అలంకరించి కల్యాణోత్సవం నిర్వహించారు. శ్రీ వాసవి మిత్రమండలి అధ్యక్షులు చేగు వెంకటేశ్వరరావు దంపతులు, నేరేళ్ల విజయలక్ష్మి కల్యాణోత్సవంలో పాల్గొన్నారు. భక్తులు కల్యాణోత్సవాన్ని తిలకించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. భక్తులకు అన్నప్రసాద వితరణ గావించారు.

558.70 అడుగులకు చేరిన సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయం నీటిమట్టం బుధవారం 558.70 అడుగులకు చేరింది. ఇది 229.3671 టీఎంసీలకు సమానం .సాగర్ జలాశయం నుంచి ఎస్ఎల్‌బీసీకి 1,650 క్యూసెక్కులు విడుదలవుతోంది. శ్రీశైలం నుంచి సాగర్ జలాశయానికి 65,900 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.

రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యం



నరసరావుపేట: జిల్లాలో రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా పనిచేస్తామని రోడ్డు సేఫ్టీ మెంబర్ సెక్రటరీ, ఆర్‌అండ్‌బీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ జి.గీతారాణి పేర్కొన్నారు. పల్నాడు జిల్లా రహదారి భద్రతా కమిటీ రూపొందించిన 'థింక్ రోడ్డు సేఫ్టీ' పోస్టర్‌ను బుధవారం ఆర్‌అండ్‌బీ కార్యాయంలో రోడ్డు సేఫ్టీ అధ్యక్షురాలు దుర్గాపద్మజ, సభ్యులతో కలిసి ఆవిష్కరించారు. ఇటీవల బాధ్యతలు స్వీకరించిన ఆమెను రోడ్డుసేఫ్టీ ఎన్‌జీఓ బృందం మర్యాదపూర్వకంగా కలిసింది. ఈసందర్భంగా గీతారాణి మాట్లాడుతూ సుప్రీంకోర్టు కమిటీ ఆన్ రోడ్ సేఫ్టీపై ఇచ్చిన ఆదేశాలు తప్పకుండా పాటిస్తామన్నారు. రోడ్డు సేఫ్టీ ఎన్జీఓ తరఫున ఇచ్చే సూచనలు కూడా పరిగణలోకి తీసుకుని కమిటీలో చర్చించటం జరుగుతుందన్నారు. జిల్లా రహదారి భద్రతా కమిటీ చైర్మన్, జిల్లా కలెక్టర్ పి.అరుణ్‌బాబు సూచనల మేరకు జిల్లాను రోడ్డు ప్రమాద రహిత జిల్లాగా మార్చేందుకు కృషిచేస్తామని అన్నారు.

బదిలీ కావాలంటే ఒక రేటు.. మైనింగ్ చేసుకోవాలంటే ఓ పర్సంటేజ్.. మద్యం దుకాణం దక్కించుకోవాలంటే పార్టనర్ షిప్.. అక్రమ రేషన్ వ్యాపారం స్మూత్‌గా సాగిపోవాలంటే వాటాలు.. కాంట్రాక్టుల్లో కమీషన్లు.. నామినేటెడ్ పోస్టులకో రేటు.. ఇలా ఎందెందు వెతికినా అందందు ఆయన అవినీతే కనిపిస్తుంది. కుదరితే రాజీ.. కుదరకపోతే దౌర్జన్యం ఆయన వైఖరి. అస్మదీయులకు అందలం.. అదే పార్టీ అయినా గిట్టని వారికి అవమానాలు.. ఇదీ ఆయన తీరు. అన్నిటా ధనదాహం, అధికార మదం.. అడుగడుగునా కనిపిస్తున్నాయి. ఆయనే ప్రత్తిపాడు ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు. తన అల్లుడితో కలిసి నియోజకవర్గంలో ఆయన సాగిస్తున్న అవినీతి, అక్రమాలకు అంతే లేకుండాపోతోంది.

అన్నిటా కమీషన్లు.. ఫిక్స్‌డ్ రేట్లు..



ఇదీ.. ఎమ్మెల్యే బూర్ల రామాంజనేయులు అవినీతి బాగోతం

- రేషన్ మాఫియా నుంచి రూ.లక్షల్లో కప్పం
- మద్యం వ్యాపారంలోనూ భారీగా వాటాలు
- అక్రమ గ్రావెల్ మైనింగ్‌కు అనుమతిచ్చి వసూళ్లు
- బదిలీలు, నామినేటెడ్ పోస్టులకూ లంచాలు
- అధికారమే అండగా చెలరేగిపోతున్న ప్రత్తిపాడు ఎమ్మెల్యే
- అక్రమార్జన కోసం అడ్డగోలుగా అధికార దుర్వినియోగం
- సొంత పార్టీ నేతలనూ వదలని అవినీతి తిమింగలం
- నియోజకవర్గ ప్రజలను పట్టిపీడిస్తున్న మామా అల్లుళ్లు

సాక్షి విజిలెన్స్

సాక్షి టాస్క్‌ఫోర్స్: గుంటూరు జిల్లా ప్రత్తిపాడు నియోజకవర్గంలో ఎమ్మెల్యేగా బూర్ల రామాంజనేయులు, షాడో ఎమ్మెల్యేగా ఆయన అల్లుడు రాజేష్ వ్యవహరిస్తున్నారు. వారి తీరు అటు సొంత పార్టీలోని నేతలకే మింగుడు పడటం లేదు. వారి అవినీతి దాహానికి అంతులేకుండా పోతోందన్న ఆరోపణలు ఆ పార్టీ నేతల నుంచే పెద్ద ఎత్తున వినిపిస్తున్నాయి. 'ఇక నుంచి ఇది రామాంజనేయులు అడ్డా. ఇక్కడ నేను చెప్పిందే వేదం .. నా మాటే శాసనం.. అంటూ వట్టిచెరుకూరు మండలంలో అధికార దర్పం చాటేలా బాహాటంగా ప్రకటన చేశారు కూడా. 'నాకు ఓటు వేయని ఎస్సీలకు పథకాలు రావడానికి వీల్లేదు. నాకు తెలియకుండా నాయకులు కూడా ఇవ్వడానికి కుదరదంటూ.. ' అధికార కావరంతో బహిరంగ సమావేశంలోనే వ్యాఖ్యలు చేశారు. ఇలా చెప్పుకుంటూ అధికారమే అండగా ఆయన చేస్తున్న అవినీతి, అక్రమాలు మాటల్లో చెప్పలేనంతగా ఉన్నాయి.

రేషన్ మాఫియాకు అండదండలు...

ప్రత్తిపాడు నియోజకవర్గంలో రేషన్ మాఫియాకు పూర్తి స్థాయిలో ఎమ్మెల్యే అండదండలు ఉన్నాయి. తొలినాళ్లలో నియోజకవర్గంలో పల్నాడు జిల్లా వినుకొండ ప్రాంతానికి చెందిన ఓ ముఠాకు ఈ వ్యాపారం కట్టబెట్టారు. అడిగినంత ముట్టజెప్పలేక వారు పరారయ్యారు. అనంతరం పొన్నూరు నియోజకవర్గానికి చెందిన ఓ బ్యాచ్‌కు అప్పగించారు. ఆ ముఠాకు సహకరించని ఎండీయూ వాహనాల నిర్వాహకులు, డీలర్లు, వ్యాపారులపై తనిఖీలు, దాడులు చేయించి భయపెట్టి గుప్పెట్లోకి తెచ్చుకున్నారు. వారు కూడా పెద్ద మొత్తంలో కప్పం కట్టలేక వెళ్లిపోయారు. ప్రస్తుతం చిలకలూరిపేటకు చెందిన వ్యక్తులు నిర్భయంగా ఈ దందా సాగిస్తున్నారు.

మద్యం వ్యాపారంలోనూ..

మద్యం వ్యాపారంలో ఎమ్మెల్యే, షాడో ఎమ్మెల్యేలు నేరుగా వాటాలు పంచుకోవాలని ముందుగా భావించారు. నిర్వాహకులకు ఎమ్మెల్యే కార్యాలయం నుంచే ఫోన్లు చేసి సగం ఇవ్వాల్సిందేనని, లేదంటే కష్టమని బెదిరింపులకు పాల్పడ్డారు. కొందరు వాటాలు ఇచ్చారు. ప్రభుత్వం మద్యంపై పద్నాలుగు శాతమే కమీషన్ ఇస్తుండటంతో వాటాలు కావాలన్న వారు నష్టాలొస్తున్నాయని ఒక్కొక్కరుగా తప్పుకొన్నారు. ఇప్పుడు ఒక్కో దుకాణానికి రూ. 5 లక్షల చొప్పున వన్‌టైం సెటిల్‌మెంట్ కింద కప్పం కట్టాలని ఒత్తిడి తెస్తున్నారు. నియోజకవర్గంలో సుమారు పదిహేను షాపులున్నాయి. అబ్కారీ అధికారులే మధ్యవర్తిత్వం వహిస్తుండటం, వ్యాపారులకు ఫోన్లు చేసి ఫలానా నాయకుడికి కలవాలని చెబుతుండటం విస్తుపోయేలా చేస్తోంది.

అడ్డగోలుగా మైనింగ్..

గుంటూరు రూరల్ మండలంలోని ఓబులనాయుడుపాలెం సమీపంలోని నాయుడు పేట, ప్రత్తిపాడు మండలంలోని నడింపాలెం పంచాయతీ పరిధిలో రేయింబవళ్లు అక్రమ గ్రావెల్ దందా సాగుతూనే ఉంది. ఎమ్మెల్యే అల్లుడు, ఆయన బినామీల ఆధ్వర్యంలో జరుగుతోంది. ఎన్నికల ప్రచారం సమయంలో బూర్ల రామాంజనేయులు ఆయా మైనింగ్ క్వారీల వద్దకు వెళ్లి చేసిన హడావుడి అంతాఇంతా కాదు. మట్టి సంపదను దోచుకున్నారని, అంతా లెక్క తేలుస్తామన్నారు. ఇప్పుడు వారు కూడా అదే తవ్వకాలను అంతకు మించి పదిరెట్లు ఎక్కువగా చేస్తున్నారు. ట్రిప్పుల లెక్కల ఎమ్మెల్యేకు కప్పం కడుతున్నారు. మైనింగ్, పోలీస్, రెవెన్యూ అధికారులు పట్టించుకోవడం లేదు.

బదిలీలు, నామినేటెడ్ పోస్టుల్లోనూ వసూళ్లు

అటు ఉద్యోగుల బదిలీలు, నామినేటెడ్ పోస్టుల విషయంలోనూ ఎమ్మెల్యే చేయి తడిపితే లెటర్ ఇస్తున్నారు. ఇటీవల సాధారణ బదిలీల్లో ఉద్యోగుల స్థాయిలను బట్టి దండుకుంటున్నారు. సొంత పార్టీ వారికి నామినేటెడ్ పోస్టులు ఇవ్వాలన్నా అదే తరహాలో వసూళ్లు చేయడం గమనార్హం.

అధికారమే అండగా..

ఇక అధికారమే అండగా ఎమ్మెల్యేతోపాటు ఆయన అనుచరులు రెచ్చిపోతున్నారు. వారే దాడులు చేయడం, బాధితులపైనే కేసులు పెట్టించడం పరిపాటిగా మారింది. ఎమ్మెల్యే అనుచరుల మాట వినకుంటే నేరుగా ఎమ్మెల్యే రంగంలోనికి దిగి దాదాగిరీ, దౌర్జన్యాలు చేయడం ఇటీవల తొలి అడుగులో పెదనందిపాడు మండలం పాలపర్రులో వాటర్ ప్లాంట్ విషయంలో కనిపించింది. ఆయనపై సొంత పార్టీ నేతలే ఇటీవల మంత్రి లోకేష్ వద్ద, రాష్ట్ర పార్టీ కార్యాలయాలకు వెళ్లి పదవుల విషయంలో ఫిర్యాదులు సైతం చేసిన సందర్భాలు ఉన్నాయి.

ప్రార్థనతోనే జీవితం ధన్యం



వాక్యోపదేశం చేస్తున్న గోవిందుజోజి

ఫిరంగిపురం: ప్రతి ఒక్కరూ ప్రార్థన చేయడం చేస్తేనే జీవితం ధన్యమవుతుందని నల్గొండ జిల్లా విశ్రాంత పీఠాధిపతులు గోవిందుజోజి అన్నారు. మండల కేంద్రంలోని కార్మెల్‌మాత ఉత్సవాల్లో భాగంగా చివరిరోజు కార్మెల్ కొండ దిగువ భాగంలో దివ్య పూజాబలి కార్యక్రమం బుధవారం నిర్వహించారు. కార్మెల్‌మాత తన బిడ్డల పట్ల ఎంతో ప్రేమగా ఉంటుందన్నారు. వారి కష్టాలు తీరుస్తుందని చెప్పారు. ఎంతటి కష్ట సమయంలో కూడా నమ్మకాన్ని కోల్పోకూడదని తెలిపారు. అనంతరం దివ్యపూజాబలి నిర్వహించారు. కార్మెల్ మాతను ఎమ్మెల్యే శ్రావణ్‌కుమార్ దర్శించుకొన్నారు. మూడురోజులగా నిర్వహిస్తున్న ఉత్సవాలకు అనేక ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చారు. కొండను ఎక్కి కార్మెల్ మాత స్వరూపం వద్ద కొబ్బరికాయలు కొట్టి, కొవ్వొత్తులు వెలిగించారు. మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు అన్నదానం చేశారు. 130 మంది పోలీసులతో బందోబస్తు ఏర్పాటు చేసినట్లు సీఐ శివరామకృష్ణ తెలిపారు.



దివ్యపూజాబలిలో పాల్గొన్న విశ్వాసులు

ఏటా.. విద్యా కుసుమాలకు బాసట

విద్యా కుసుమాలకు ఏటా సాయం అందిస్తూ అందరి మన్ననలు పొందుతోంది కోటిరెడ్డి స్మారక ట్రస్టు. చిన్నతనంలో చదువు కోసం తాను పడిన ఇబ్బందులు నేడు మరెవ్వరూ పడకూడదని తండ్రి పేరిట ఎన్నారై యేరువ సాయిరాం సాయం చేస్తున్నారు.




గత ఏడాది ఉపకార వేతనాలను అందిస్తున్న ట్రస్ట్ సభ్యులు

- రూ.60 లక్షల వంతున ఏటా అందిస్తున్న కోటిరెడ్డి స్మారక ట్రస్టు
- నేడు పెద పలకలూరులో ఉపకార వేతనాల పంపిణీ
- 1,525 మంది విద్యార్థులకు అందనున్న ఆర్థిక సాయం

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్) : ప్రతిభావంతులైన పేద విద్యార్థులకు భరోసాగా నిలవాలనే తలంపుతో 2001 నుంచి కోటిరెడ్డి స్మారక ట్రస్టు ద్వారా ఉపకార వేతనాలు అందిస్తున్నారు. తొలుత తల్లిదండ్రులు లేని వంద మందికి రూ.3 వేల చొప్పున అందించారు. తర్వాత ఆ సంఖ్యను వేలకు పెంచారు. 2012 వరకు రూ. కోట్ల సహాయం చేశారు. అనంతరం ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 50 ప్రభుత్వ పాఠశాలలకు సేవలు విస్తరించారు. ఏటా ఒక్కో స్కూలుకు రూ.36 వేల చొప్పున అందిస్తున్నారు. పదవ తరగతిలో తొలి నాలుగు స్థానాల్లో నిలిచిన వారికి రూ.5 వేలు చొప్పున, 6, 7, 8, 9వ తరగతుల్లో ఫస్ట్ ర్యాంక్ సాధించిన నలుగురికి తలా రూ. వెయ్యి వంతున అందిస్తున్నారు. తల్లిదండ్రులు లేని లేదా పేద కుటుంబాలకు చెందిన విద్యార్థులకు ప్రతి నెలా రూ.లక్ష ఇస్తున్నారు. 2012 నుంచి ఇంటర్, బీటెక్ విద్యార్థులతోపాటు ఎంబీబీఎస్, తదితర కోర్సులు చేసే 500 మందికిపైగా విద్యార్థులకు కూడా రూ.5 వేల చొప్పున సాయం అందుకుంటున్నారు. 2012 -24 వరకు సుమారుగా ఏటా రూ.60 లక్షలకుపైగా ఇచ్చి విద్యార్థులకు అండగా ఉంటున్నారు.

పంపిణీకి ఏర్పాట్లు పూర్తి



ఈ ఏడాది సైతం 1,525 మందికి సుమారు రూ.45 లక్షల మేరకు ఉపకార వేతనాలు అందజేయడానికి విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పూర్తయింది. పెద పలకలూరులోని శ్రీ చైతన్య స్కూల్ గ్రౌండ్‌లో పంపిణీ చేయనున్నాం. విద్యార్థులకు ఇలా సాయం చేసే అవకాశాన్ని నా అదృష్టంగా భావిస్తున్నా. మహోన్నత కార్యక్రమానికి శ్రీకారం చుట్టేందుకు స్నేహితులు, కుటుంబసభ్యులు అందించిన సహకారం మరువలేనిది. - యేరువ సాయిరాం

పాఠశాల నిర్మించి...



ట్రస్ట్ పేరిట నిర్మించిన పాఠశాల భవనం

గుంటూరు రూరల్ మండలం, పెద పలకలూరు గ్రామానికి చెందిన యేరువ సాయిరాం ఉన్నత శిఖరాలు అధిరోహించినప్పటికీ తన మూలాలు మర్చిపోలేదు. తన చిన్నతనంలో ఊరిలో స్కూలు లేకపోవడంతోపాటు ఉన్నతవిద్యకు సుదూరం వెళ్లాల్సి రావడం వంటి తాను చదువు కోసం పడిన కష్టాలు మరెవ్వరూ పడకూడదని నిర్ణయించుకున్నారు. ఏటా వేల మంది విద్యార్థులకు తన తండ్రి పేరిట ట్రస్ట్ ద్వారా ఉపకార వేతనాలు అందిస్తూ విద్యాదాతగా వెలుగొందుతున్నారు. పెద్ద పలకలూరులో ఉన్నత పాఠశాల లేకపోవడంతో తొలుత జిల్లా పరిషత్ హైస్కూల్‌కి స్థలం అందించారు. 1998లో పాఠశాల భవనం కూడా నిర్మించి ఇచ్చారు. ఏడవ తరగతి వరకు ఉన్న పాఠశాలను పదవ తరగతి వరకు అప్‌గ్రేడ్ చేయించారు. సొంతూరుతోపాటు తురకపాలెం, చిన పలకలూరు, మల్లవరం తదితర గ్రామాల విద్యార్థులకు కూడా ఉపయుక్తంగా ఉండేలా సకల సౌకర్యాలతో తీర్చిదిద్దారు.



కోటిరెడ్డి (ఫైల్)

'పీ-4'పై అధికారులు చొరవ చూపాలి



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి

గుంటూరు వెస్ట్: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన పీ-4 కార్యక్రమం అమలుపై అధికారులు మరింత చొరవ చూపాలని జిల్లా కలెక్టర్ ఎస్.నాగలక్ష్మి తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ హాలులో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ బంగారు కుటుంబాల నీడ్ బేస్డ్ ప్రాథమిక సర్వే ఈ నెల 21వ తేదీ నుంచి జిల్లా వ్యాప్తంగా ప్రారంభించాలన్నారు. నాణ్యమైన సేవలు అందించలేని మార్గదర్శకులను తొలగించాలన్నారు. సమావేశంలో జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, సీపీఓ శేషశ్రీ, డీపీఓ నాగసాయికుమార్, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గృహ నిర్మాణాలపై దృష్టి సారించండి

మంగళగిరి నియోజకవర్గ పరిధిలోని ఇల్లు లేని పేదలకు వీలైనంత త్వరగా శాశ్వత ఇళ్ల పట్టాలు, టిడ్కో ఇళ్ల మంజూరు పత్రాలు సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. బుధవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ మినీ సమావేశ మందిరంలో జాయింట్ కలెక్టర్ ఎ.భార్గవ్‌తేజ, తెనాలి సబ్ కలెక్టర్ అంజనా సింహ, అధికారులతో నిర్వహించిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ దీర్ఘకాలంగా వివిధ ప్రభుత్వ స్థలాల్లో నివాసం ఉంటున్న పేదలకు మంత్రి లోకేష్ శాశ్వత ఇళ్ల పట్టాలు అందించేందుకు సమాయత్తం అవుతున్నారన్నారు. పట్టాల పంపిణీకి చర్యలు తీసుకోవాలన్నారు. స్థలాలకు సంబంధించి కోర్టు పరిధిలో ఉన్న అంశాలను త్వరగా పరిష్కారం అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. సమావేశంలో డీఆర్వో షేక్ ఖాజావలి, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ లక్ష్మీకుమారి, జెడ్పీ సీఈఓ జ్యోతిబసు, ఎంటీఎంసీ కమిషనర్ అలీం బాషా, అధికారులు పాల్గొన్నారు.

ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమం



వ్యవసాయ బులెటిన్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

గుంటూరు రూరల్: ఆచార్య ఎన్జీరంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం ఉపకులపతి డాక్టర్ ఆర్. శారదజయలక్ష్మిదేవి అధ్యక్షతన ఐకార్ (ఐసీఏఆర్) విశ్రాంత శాస్త్రవేత్తలతో విశ్వవిద్యాలయం పరిధిలోని విద్యార్థులు, శాస్త్రవేత్తలతో చర్చా కార్యక్రమాన్ని బుధవారం నిర్వహించారు. నగర శివారుల్లోని లాంఫాంనందున్న విశ్వవిద్యాలయం సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఐకార్ విశ్రాంత శాస్త్రవేత్తలైన ప్రధాన శాస్త్రవేత్త (ఇక్రిశాట్) డాక్టర్ ఎస్ఎన్ నిగం, డైరెక్టర్ (ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఆయిల్ సీడ్స్) డాక్టర్ డీఎం హెగ్డే, ఐకార్ ఏడీజీ డాక్టర్ బీబీ సింగ్‌లు పాల్గొన్నారు. కార్యక్రమంలో అతిథుల చేతుల మీదుగా వ్యవసాయంలో నేల ఆరోగ్య పరిరక్షణ అనే వ్యవసాయ బులెటిన్‌ను రైతులు, వ్యవసాయ శాఖ సిబ్బంది వినియోగించుకునేందుకు వీలుగా విడుదల చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎస్ఎన్ నిగం మాట్లాడుతూ వివిధ పంటల రకాల రూపకల్పనలో ఆధునిక పద్ధతులతోపాటు సంప్రదాయ విధానాలను కూడా వినియోగించుకోవాలని సూచించారు. రిజిస్ట్రార్ డాక్టర్ జి.రామచంద్రరావు, ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు, కమ్యూనిటీ సైన్స్, ఏపీజీసీ శాస్త్రవేత్తలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ అప్పిరెడ్డికి నోటీసులు



పట్నంబజారు: ఎమ్మెల్సీ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లేళ్ల అప్పిరెడ్డికి సత్తెనపల్లి పోలీసులు బుధవారం నోటీసులు జారీ చేశారు. వైఎస్సార్‌సీపీ అధ్యక్షులు వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రెంటపాళ్ల పర్యటనలో భాగంగా జన సమీకరణ చేశారనే నెపంతో అక్రమ కేసు బనాయించిన విషయం విదితమే. ఈ క్రమంలో ఈ నెల 18వ తేదీన విచారణకు హాజరు కావాలంటూ పోలీసులు నోటీసులను విద్యానగర్‌లోని నివాసంలో ఆయన్ను కలిసి అందజేశారు. సానుకూలంగా స్పందించిన ఎమ్మెల్సీ అప్పిరెడ్డి నోటీసులు తీసుకున్నారు. విచారణకు హాజరవుతామని తెలిపారు.

వాణిజ్యం

నిమ్మకాయల ధరలు

గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్‌యార్డులో బుధవారం నిమ్మకాయల క్వింటా ధర

కనిష్ఠం : రూ. 1,000 గరిష్ఠం : రూ. 1,600

మోడల్ ధర రూ. 1,300

మిర్చి యార్డు సమాచారం

(బుధవారం ధరలు)



వచ్చిన బస్తాలు	55,232
అమ్మకాలు	53,535
నిల్వ	9,175

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-13,000
నంబరు-5	10,000-13,300
341	10,000-13,400
సూపర్-10	10,000-13,000

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	9,500-12,600
నంబరు-5	10,000-13,500
341	10,000-13,500
4884	10,000-12,500

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000 - 13,800
షార్క్-1	10,000-12,200
బాడిగ-355	10,000 - 12,300
దేవనూరు డీలక్స్	10,000 - 12,400
ఆర్మూర్	9,600 - 10,800
తాలుకాయలు	5,000 - 6,900

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	10,000-13,600
బాడిగ - 355	10,000-12,600
దేవనూరు డీలక్స్	10,000-12,500
తాలు	5,200 - 7,000

-కొరిటెపాడు (గుంటూరు)

భయంతోనే సర్పంచ్ హత్యకు ధూళిపాళ్ల కుట్ర

- మినీ మహానాడులో వ్యాఖ్యలు అమలులో భాగంగానే సర్పంచ్‌పై పాశవిక దాడి
- వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ మండిపాటు



నాగ మల్లేశ్వరరావు కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న శైలజానాథ్, మురళీకృష్ణ, రవీంద్రనాథ్‌రెడ్డి

పట్నంబజారు (గుంటూరు ఈస్ట్): సర్పంచ్ నాగ మల్లేశ్వరరావు కుటుంబాన్ని చూసి పొన్నూరు టీడీపీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర భయపడ్డారని వైఎస్సార్ సీపీ నేత, మాజీ మంత్రి సాకే శైలజానాథ్ అన్నారు. అందుకే మినీ మహానాడులో అంతమొందించాలని వ్యాఖ్యలు చేసి, ఆ మేరకు అమలు చేశారని ఆందోళన వ్యక్తం చేశారు. పొన్నూరు నియోజకవర్గం మన్నవ గ్రామంలో అతి కిరాతకంగా సర్పంచ్ బొనిగల నాగ మల్లేశ్వరరావుపై టీడీపీ గూండాలు దాడి చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. తీవ్రంగా గాయపడి గుంటూరులోని రమేష్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న నాగ మల్లేశ్వరరావును బుధవారం స్థానిక సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డితో కలిసి ఆయన పరామర్శించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి శైలజానాథ్ మాట్లాడుతూ పొన్నూరులో అంబటి మురళీకృష్ణకు ఓటింగ్ శాతం పెరగడాన్ని ధూళిపాళ్ల జీర్ణించుకోలేక పోయారన్నారు. నాగ మల్లేశ్వరరావుపై హత్యాయత్నం ఘటనలో గత్యంతరం లేక పోలీసులు కేసు పెట్టినట్లు ఉందని, రిమాండ్ రిపోర్ట్ ఇంకా పూర్తి కాకుండానే కేసులో నిందితులుగా ఉన్న ఏ-4, ఏ-5 లను తొలగించినట్లు వార్తలు వస్తున్నాయని ఆరోపించారు. రాష్ట్ర చరిత్రలో చార్జిషీట్ దాఖలు చేయకుండానే, ఎంక్వైరీ జరగకుండానే పేర్లు తొలగించడం ఎక్కడా జరగలేదన్నారు.

రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం...

రాష్ట్రంలో డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రాజ్యాంగాన్ని పక్కన బెట్టి.. నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేస్తున్నారని మాజీ మంత్రి శైలజానాథ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. నాగ మల్లేశ్వరరావుకు ప్రాణం మిగిలింది కాబట్టి హత్యాయత్నం అయిందని, అదే ప్రాణం పోయి ఉంటే హత్య అయ్యేదన్నారు. కూటమి ప్రభుత్వం రాజకీయ ప్రత్యర్థులతో రాజకీయంగా పోరాటం చేయాలిగానీ ఇలాంటి భౌతిక దాడులకు పాల్పడడం సిగ్గుచేటన్నారు. వైఎస్సార్ సీపీ పంచాయతీరాజ్ విభాగం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర రాజకీయాల్లో ఎన్నడూ లేని క్రూరమైన పాలన చూస్తున్నామని పేర్కొన్నారు.

మానవత్వం లేని వ్యక్తి నరేంద్ర

కనీస మానవత్వం, దయ లేని వ్యక్తి ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్ర అని వైఎస్సార్ సీపీ పొన్నూరు సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ ధ్వజమెత్తారు. ఈ కేసులో ప్రధాన నిందితుడు ధూళిపాళ్లేనని స్పష్టం చేశారు. హింసా రాజకీయాలకు బదులు చెప్పే రోజులు వస్తాయని హెచ్చరించారు.

మధ్యవర్తిత్వంపై అవగాహన సదస్సు



ర్యాలీని ప్రారంభిస్తున్న జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి. సాయి కల్యాణ చక్రవర్తి

గుంటూరు లీగల్: జాతీయ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆదేశాల మేరకు 90 రోజుల మధ్యవర్తిత్వ డ్రైవ్‌లో భాగంగా జిల్లా న్యాయ సేవాధికార సంస్థ భవన్‌లో బుధవారం క్షక్షిదారులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ప్యానెల్ అడ్వకేట్‌లు, పారా లీగల్ వలంటీర్లు, కక్షిదారులు పాల్గొన్నారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్, జిల్లా ప్రధాన న్యాయమూర్తి బి.సాయి కల్యాణ చక్రవర్తి ఆధ్వర్యంలో ర్యాలీ ప్రారంభించారు. మెడికల్ కాలేజీ రోడ్ నుంచి పోలీస్ పరేడ్ గ్రౌండ్ మీదుగా తిరిగి జిల్లా కోర్ట్ ప్రాంగణం వరకు ర్యాలీ కొనసాగింది. జిల్లా ప్రధాన న్యాయమూర్తి అవగాహన సదస్సును ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. ప్రజలందరూ మధ్యవర్తిత్వంపై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. రాజీపడదగిన అన్ని సివిల్, క్రిమినల్, భార్యాభర్తల వివాదాలు, కుటుంబ వివాదాలను మధ్యవర్తిత్వం ద్వారా రాజీ చేసుకొని కేసులను సత్వరమే పరిష్కరించుకోవాలని పేర్కొన్నారు. మధ్యాహ్నం ఇన్సూరెన్సు కంపెనీస్, చిట్ ఫండ్ కంపెనీస్, ఫైనాన్షియల్ ఇనిస్టిట్యూషన్స్, ఇతర స్టేక్ హోల్డర్లకు మధ్యవర్తిత్వం వల్ల ఉపయోగాలను వివరించారు. జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి సయ్యద్ జియావుద్దీన్ మాట్లాడుతూ మధ్యవర్తిత్వంపై వారం రోజుల కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో న్యాయమూర్తులు జి.చక్రపాణి,.ఆర్.శరత్ బాబు, ఎ.వి.ఎల్.సత్యవతి, సి.హెచ్.వి.ఎన్. శ్రీనివాసరావు, వై.నాగరాజా, షమీమ్ పర్వీన్ సుల్తానా బేగం, కె.నీలిమ, లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్, మీడియేషన్ అడ్వొకేట్లు, పారా లీగల్ వలంటీర్స్, ఇన్సూరెన్స్ కంపెనీస్, చిట్‌ఫండ్ కంపెనీస్, ఫైనాన్సియల్ ఇనిస్టిట్యూషన్స్, స్టేక్ హోల్డర్స్, జిల్లా న్యాయ సేవాధికార సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ స్థాయి అథ్లెటిక్స్ పోటీలకు పర్వీన్



పర్వీన్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్ కామేశ్వరశాస్త్రి

గుంటూరు ఎడ్యుకేషన్: బిహార్‌లో జరగనున్న జాతీయస్థాయి అథ్లెటిక్స్ పోటీలకు టీజేపీఎస్ కళాశాల సీనియర్ ఇంటర్ విద్యార్థిని కె. పర్వీన్ ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ బీవీహెచ్ కామేశ్వరశాస్త్రి తెలిపారు. పట్టాభిపురంలోని కళాశాలలో బుధవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ... ఈ నెల 12న నరసరావుపేటలో జరిగిన రాష్ట్ర స్థాయి లేజర్ రన్ పోటీల్లో భాగంగా అండర్-17 విభాగంలో తృతీయ స్థానంలో నిలిచిన పర్వీన్.. 15న ఏఎన్‌యూలో జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ నిర్వహించిన మీట్‌లో 100 మీటర్ల పరుగు పందెంలో తృతీయ స్థానం, 100 మీటర్ల హర్డిల్స్‌లో ద్వితీయ స్థానం పొందినట్లు వివరించారు. త్వరలో బిహార్‌లో జరగనున్న జాతీయ స్థాయిలో పోటీలకు ఎంపిక కావడం కళాశాలకు గర్వకారణం అన్నారు. విద్యార్థినిని కళాశాల కరస్పాండెంట్ కేవీ బ్రహ్మం అభినందించారు. కార్యక్రమంలో పీజీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్.అనితాదేవి, వ్యాయామ అధ్యాపకులు టి. వాసుదేవరావు, కోచ్ ఆర్.శివాజీ, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఎంఎస్ఎంఈ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్‌తో భేటీ



తమ్మిరెడ్డి శివశంకరరావును కలిసిన తులసి యోగీష్‌చంద్ర, ధరణీష్, కమల్ తదితరులు

కొరిటెపాడు: 'లఘు ఉద్యోగ భారతి – ఆంధ్రప్రదేశ్'కు నూతనంగా ఏర్పడిన రాష్ట్ర కమిటీ ప్రతినిధులు బుధవారం ఆంధ్రప్రదేశ్ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావును మంగళగిరిలోని ఆయన కార్యాలయంలో కలిశారు. రాష్ట్ర కమిటీ అధ్యక్షుడు తులసి యోగీష్ చంద్ర, కోశాధికారి ధరణీష్, ఉపాధ్యక్షుడు కమల్ నయన్ భాంగ్, సంయుక్త ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యేశ్వరరావు, కార్యదర్శి తోట రామకృష్ణ, ఈసీ సభ్యులు విఠల్ ప్రసాద్ కలిసిన వారిలో ఉన్నారు. రాష్ట్రంలోని ఎంఎస్ఎంఈలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరిస్తూ కమిటీ వినతిపత్రాన్ని సమర్పించింది. అధిక పారిశ్రామిక విద్యుత్ చార్జీలు, ప్రభుత్వ శాఖల నుంచి ఆలస్యంగా చెల్లింపులు, నైపుణ్యం కలిగిన మానవ వనరుల కొరత, ఆర్థిక సహాయం పొందడంలో ఇబ్బందులు, మెమోరాండం ఆఫ్ డిపాజిట్ ఆఫ్ టైటిల్ డీడ్స్‌పై అధిక చార్జీలు ఉన్నాయని వినతి పత్రంలో పేర్కొన్నారు. చైర్మన్ తమ్మిరెడ్డి శివశంకరరావు.. నూతన రాష్ట్ర కమిటీకి అభినందనలు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఎంఎస్ఎంఈల ప్రోత్సాహం, అభివృద్ధి కోసం లఘు ఉద్యోగ భారతితో కలిసి పని చేయడానికి మద్దతు ఇస్తానని హామీ ఇచ్చారు.

నా భార్య కారణంగానే చనిపోతున్నా..

సెల్ఫీ వీడియో తీసుకొని యువకుడు ఆత్మహత్య



బ్రహ్మయ్య (ఫైల్)

తాడేపల్లి రూరల్: తన చావుకు భార్య కారణమని పేర్కొంటూ ఓ యువకుడు సెల్ఫీ వీడియో తీసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ సంఘటన బుధవారం వెలుగులోకి వచ్చింది. సేకరించిన వివరాల ప్రకారం... తాడేపల్లి పట్టణ పరిధిలోని నులకపేటకు చెందిన బ్రహ్మయ్య (30) సీసీ కెమెరాల టెక్నీషియన్‌గా పనిచేస్తున్నాడు. మంగళగిరి టిడ్కో నివాసాల్లో ఉంటున్న యువతితో వివాహం జరిగింది. ఆమె ప్రవర్తన సరిగ్గా లేదని పుట్టింటికి పంపించేశాడు. అందరూ బ్రహ్మయ్యను బతిమిలాడితే ఆమెను కాపురానికి తీసుకొచ్చినట్లు బంధువులు తెలిపారు. అత్తాకోడళ్ల గొడవల కారణంగా బ్రహ్మయ్య సొంత ఇంటి నుంచి ఉండవల్లి అమరావతి రోడ్‌లోని ఒక ఇంటిలో అద్దెకు దిగాడు. అక్కడ మళ్లీ ఆమె ఫోనులో ఎక్కువగా మాట్లాడుతుండటంతో గొడవలు జరిగాయి. ఈలోగా ఆషాఢ మాసం రావడంతో పుట్టింటికి వెళ్లింది. ఈ నేపథ్యంలో మంగళవారం రాత్రి సుమారు 9 గంటల సమయంలో తన చావుకు భార్య కారణం అంటూ సెల్ఫీ వీడియో తీసుకొని బ్రహ్మయ్య ఫ్యానుకు ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. తాడేపల్లి పోలీసులు వచ్చి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మంగళగిరి ఏరియా ఆసుపత్రికి తరలించారు. భర్త చనిపోయిన ఏడాదికే ఇలా కుమారుడు కూడా ఆత్మహత్య చేసుకోవడంతో బ్రహ్మయ్య తల్లి కన్నీరుమున్నీరైంది. ఇష్టం లేకపోతే విడాకులు తీసుకుందామని చెప్పినా ఎందుకు ఇలా చేశావని ఆవేదన వ్యక్తం చేసింది. తన కుమారుడి చావుకు కారణమైన కోడలు, ఆమె ప్రియుడిని శిక్షించాలని డిమాండ్ చేసింది.

నకిలీ ధ్రువీకరణ పత్రంతో మోసం

పోలీసు కేసు నమోదు

పెదకాకాని: ప్రభుత్వ అధికారి సంతకాన్ని ఫోర్జరీ చేసి నకిలీ ధ్రువీకరణ పత్రం తయారు చేసినట్లు మండలం పరిధి వెంగళరావునగర్‌కి చెందిన కూరాకుల వాసుదేవ్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కూరాకుల సత్యనారాయణ, అనూష దంపతులపై మోసం, నకిలీ పత్రాల తయారీ కేసు నమోదు చేశారు. తమ ఇంటిని విక్రయిస్తామని సత్యనారాయణ దంపతులు చెప్పడంతో 2023లో రూ.15 లక్షలు వారికి ఇచ్చినట్లు వాసుదేవ్ ఫిర్యాదు చేశారు. మిగిలిన రూ.18 లక్షల మొత్తాన్ని రిజిస్ట్రేషన్ సమయంలో చెల్లించేందుకు ఒప్పందం జరిగింది. బ్యాంకు లోన్ కోసం సదరు ఇంటి సంబంధిత పత్రాలతో వాసుదేవ్ దరఖాస్తు చేసుకున్నప్పుడు సర్వే సర్టిఫికెట్ అవసరమైంది. సత్యనారాయణ ఇచ్చిన సర్టిఫికెట్‌ను నకిలీదిగా పెదకాకాని తహసీల్దార్ కృష్ణకాంత్ తేల్చారు. సహదేవ్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు బుధవారం పెదకాకాని సీఐ టి.పి. నారాయణస్వామి తెలిపారు.

పొగాకు కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన మంత్రులు



సంతమాగులూరు(అద్దంకి): సంతమాగులూరు వ్యవసాయ మార్కెట్ యార్డులో బుధవారం వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు, విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ నల్లబర్లీ కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. మార్కెట్ యార్డు నూతన కమిటీ ప్రమాణస్వీకార కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ప్రతి రైతూ పండించిన నల్లబర్లీ ఆకు మొత్తం కొనుగోలు చేస్తామని చెప్పారు. అందుకే కొనుగోలు కేంద్రాలను పెంచుతున్నట్లు తెలిపారు. నూతన మార్కెట్ కమిటీ, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా తేలప్రోలు రమేష్, మరికొంత మంది సభ్యులుగా ప్రమాణీ స్వీకారం చేశారు. కలెక్టర్ వెంకటమురళి, ఎమ్మెల్యే అరవిందబాబు, జీవీ ఆంజనేయులు, ఎరిక్షన్‌బాబు, వివిధ శాఖల అధికారులు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యవసాయ, విజిలెన్స్ అధికారుల తనిఖీలు



రేపల్లె: రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులనే విక్రయించాలని, లేనిపక్షంలో చట్టపరమైన చర్యలు తీసుకుంటామని మైలవరం వ్యవసాయ సహాయ సంచాలకులు టి.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని ఫెర్టిలైజర్స్ దుకాణాలపై వ్యవసాయ శాఖ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా బుధవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరువుల దుకాణాల ఎదుట తప్పనిసరిగా స్టాక్ బోర్డును, ధరల పట్టిక వినియోగదారులకు కనిపించేలా ఏర్పాటు చేయాలన్నారు. విత్తనాల నాణ్యతలో రాజీపడరాదని, నకిలీ విత్తనాలు విక్రయిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు విక్రయించరాదన్నారు. దుకాణాలలో స్టాక్‌కు సంబంధించిన రికార్డులను తప్పనిసరిగా ఉంచాలని సూచించారు. పలు దుకాణాలలో తనిఖీలు నిర్వహించి అపరాధ రుసుం విధించారు. కార్యక్రమంలో రేపల్లె వ్యవసాయ సమాయ సంచాలకులు అద్దేపల్లి లక్ష్మి, వ్యవసాయశాఖ జిల్లా అధికారి మోహన్‌రెడ్డి, మండల వ్యవసాయ అధికారి మహేష్‌బాబు, విస్తరణ అధికారి నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి ఈత పోటీలకు శివసాకేత్



నరసరావుపేట ఈస్ట్: రాష్ట్ర స్థాయి 10వ జూనియర్స్ స్విమ్మింగ్ పోటీలకు శ్రీసుబ్బరాయ అండ్ నారాయణ కళాశాల విద్యార్థి కె.శివసాకేత్ ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.ఎస్.సుధీర్, వ్యాయామ అధ్యాపకుడు డాక్టర్ యక్కల మధుసూదనరావు బుధవారం తెలిపారు. గుంటూరు శ్యామలానగర్‌లోని ఎనీఆర్ స్విమ్మింగ్ పూల్‌లో నిర్వహించిన ఉమ్మడి గుంటూరుజిల్లా స్విమ్మింగ్ టీమ్ ఎంపిక పోటీల్లో శివసాకేత్ పాల్గొని 50, 100, 200 మీటర్లు బటర్ ఫ్లయి, 200, 400 మీటర్లు ఫ్రీ స్టయిల్ విభాగాలకు ఎంపికైనట్టు వివరించారు. విశాఖపట్నంలో ఈనెల 19, 20 తేదీలలో నిర్వహించనున్న రాష్ట్రస్థాయి పోటీల్లో శివసాకేత్ ఉమ్మడి గుంటూరుజిల్లాకు ప్రాతినిధ్యం వహిస్తాడని తెలిపారు. కళాశాల పాలకవర్గ అధ్యక్ష, కార్యదర్శులు కపలవాయి విజయకుమార్, నాగసరపు సుబ్బరాయగుప్త, ప్రిన్సిపాల్ డాక్టర్ సుధీర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ పి.శ్రీనివాససాయి, కోచ్ జి.సురేష్, అధ్యాపకులు శివసాకేత్‌ను అభినందించారు.

అదనపు జిల్లా కోర్టు ఏపీపీ రాజీనామా

నరసరావుపేట టౌన్: 13వ అదనపు జిల్లా కోర్టు ఏపీపీ దేశిరెడ్డి మల్లారెడ్డి బుధవారం తన పదవికి రాజీనామా చేశారు. ఈ మేరకు ఆయన తన రాజీనామా పత్రాన్ని నరసరావుపేట 13వ అదనపు జిల్లా న్యాయమూర్తికి సమర్పించినట్లు తెలియవచ్చింది. అదేవిధంగా ప్రాసిక్యూషన్ ఆఫ్ డైరెక్టర్‌కు రాజీనామ లేఖను పోస్ట్ ద్వారా పంపారు. రాష్ట్రవ్యాప్తంగా గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వ హయాంలో నియమితులైన ఏపీపీలు, ఏజీపీలను తొలగించి వారి స్థానంలో కొత్తవారిని నియమించాలనే ఆలోచనలో కూటమి ప్రభుత్వం ఉంది. ఈ నేపథ్యంలో మల్లారెడ్డి తన పదవికి రాజీనామా చేసినట్లు సమాచారం. ఆయన రాజీనామాతో టీడీపీకి చెందిన న్యాయవాదుల్లో పలువురు ఆశావాహులు ఏపీపీ పోస్టు కోసం పోటీ పడుతున్నారు.


చరిత్రకు చిరునామా బాపట్ల వ్యవసాయ కళాశాల



మాట్లాడుతున్న చంద్రశేఖర్

బాపట్ల: చరిత్రకు చిరునామాగా బాపట్ల వ్యవసాయ కళాశాల నిలిచిపోయిందని నకాసా క్రాప్ సైన్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్, చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ జాగర్లమూడి చంద్రశేఖర్ అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల 80వ వ్యవస్థాపక దినోత్సవం బుధవారం కళాశాలలో నిర్వహించారు. జాగర్లమూడి మాట్లాడుతూ ఎనిమిది దశాబ్దాలుగా విద్యారంగంలోనూ, వ్యవసాయ రంగంలోనూ విశేష సేవలు అందిస్తున్న బాపట్ల వ్యవసాయ కళాశాల ఆదర్శనీయమైన పాత్రను నిర్వహిస్తుందన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాల ఉభయ రాష్ట్రాలలో అనేక ఇతర వ్యవసాయ కళాశాలల ఆవిర్భావానికి స్ఫూర్తిదాయకమైందని అన్నారు. ఇక్కడ వ్యవసాయ విద్యార్థులకు బోధనా సిబ్బంది నేర్పించే నైపుణ్యాల ప్రభావమే ఇందుకు దోహద పడిందన్నారు. పట్టభద్రులైన అనంతరం కేవలం ఉద్యోగ సముపార్జనే దృష్టిగా భావించకుండా పలు వ్యవసాయ పరిశ్రమలను స్థాపించే దిశగా పట్టభద్రులు కృషి చేయాలన్నారు. వ్యవసాయ ఉద్యోగతను కలిగించేందుకు సరికొత్త వ్యవసాయ సాంకేతిక ఆవిష్కరణలను సాధించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూనరాణి మాట్లాడుతూ ప్రపంచ వ్యవసాయ రంగంలో విప్లవాత్మక మార్పులకు బాపట్ల వ్యవసాయ కళాశాలలోనే బీజం పడిందని, దేశ దేశాలలో తమ వ్యవసాయ సాంకేతిక ప్రతిభను చాటి ప్రపంచ ప్రఖ్యాత శాస్త్రజ్ఞులుగా ఇక్కడి విద్యార్థులు నిలిచారని పేర్కొన్నారు. జెనెటిక్స్, ప్లాంట్ బ్రీడింగ్ విభాగానికి చెందిన అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.తుషారకు ఉత్తమ పరిశోధన పత్రాన్ని సమర్పించినందుకు బంగారు పతకాన్ని బహూకరించారు. డాక్టర్ బాలినేని వెంకటేశ్వర్లు, బాలినేని స్వరూపరాణిలు డి.మంజూషకు వెండి పతకాన్ని బహుకరించారు. కార్యక్రమంలో పలువురు పూర్వ అసోసియేట్ డీన్లను సత్కరించారు.

19 నుంచి షటిల్ బ్యాడ్మింటన్ పోటీలు



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న శ్రీనివాసరావు తదితరులు

గుంటూరు వెస్ట్ (క్రీడలు): జిల్లా బ్యాడ్మింటన్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 19, 20వ తేదీల్లో 52వ జిల్లా స్థాయి పోటీలు నిర్వహించనున్నట్లు కార్యదర్శి దామచర్ల శ్రీనివాసరావు తెలిపారు. బుధవారం స్థానిక ఎన్టీఆర్ స్టేడియంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ అండర్-11 నుంచి అన్ని విభాగాలతోపాటు మాస్టర్స్ విభాగంలో 35 + నుంచి 70 + వరకు పోటీలు ఉంటాయన్నారు. విజయాలు సాధించిన వారిని విభాగాలుగా రాష్ట్ర పోటీలకు పంపిస్తామని తెలిపారు. అనంతరం పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను శ్రీనివాసరావుతోపాటు రమేష్, వెంకటేశ్వరరావు, సతీష్ చంద్ర, రాము, రమేష్, కోచ్ బాషా ఆవిష్కరించారు.

బదిలీ అయిన ఉపాధ్యాయులకు వేతనాలివ్వాలి



మాట్లాడుతున్న యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు

గుంటూరు ఎడ్యుకేషన్: బదిలీలు ముగిసిన 45 రోజుల తరువాత సైతం కొంత మంది ఉపాధ్యాయులకు వేతనాలు చెల్లించకపోవడం సరికాదని, వెంటనే చెల్లించాలని యూటీఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు నక్కా వెంకటేశ్వర్లు అన్నారు. బుధవారం బ్రాడీపేటలోని యూటీఎఫ్ జిల్లా కార్యాలయంలో జరిగిన సంఘ ముఖ్య కార్యకర్తల సమావేశంలో వెంకటేశ్వర్లు మాట్లాడుతూ .. ప్రభుత్వ తీరుపై నిరసన వ్యక్తం చేశారు. యూటీఎఫ్ రాష్ట్ర ప్రచురణల కమిటీ చైర్మన్ ఎం. హనుమంతరావు మాట్లాడుతూ బదిలీల్లోని అసంబద్ధ అంశాలు తొలగించి, సవరణ ఉత్తర్వులు కోరుతూ అనేక మంది ఉపాధ్యాయులు పెట్టుకున్న గ్రీవెన్స్‌ను త్వరగా పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు. రాజశేఖర్‌రావు, ఎం.కళాధర్ మాట్లాడుతూ మెగా పీటీఎం విట్నెస్‌పై ఉపాధ్యాయులపై ఒత్తిడి తెచ్చి మరీ విద్యాశాఖాధికారులు సమాచారాన్ని సేకరించడం పట్ల తీవ్ర అభ్యంతరాన్ని వ్యక్తం చేశారు. సమావేశంలో జిల్లా సహాధ్యక్షుడు జి.వెంకటేశ్వర్లు, కోశాధికారి ఎండీ దౌలా, జిల్లా కార్యదర్శులు సీహెచ్ ఆదినారాయణ, కె.సాంబశివరావు, ఎండీ షకీలా బేగం, టి.ఆంజనేయులు, కె.కేదార్‌నాథ్, కె.ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎదురెదురుగా రెండు కార్లు ఢీ



కారులో ఇరుక్కున్న వ్యక్తిని బయటకు తీసేందుకు యత్నిస్తున్న దృశ్యం



ప్రమాదంలో గాయపడిన మహిళ

ఒకరు మృతి, నలుగురు మహిళలకు గాయాలు

తాడికొండ: రెండు కార్లు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో వ్యక్తి దుర్మరణం చెందాడు. నలుగురు మహిళలు గాయాలపాలయ్యారు. ఈ ఘటన మండల పరిధిలోని నిడుముక్కల గ్రామంలో బుధవారం జరిగింది. వివరాల ప్రకారం.. గుంటూరు నుంచి అమరావతికి మ్యారేజ్ బ్యూరోకు సంబంధించిన నలుగురు మహిళలతో కారు వెళుతోంది. అమరావతి నుంచి గుంటూరు మరో కారు వస్తోంది. కళాజ్యోతి కార్యాలయం వద్దకు రాగానే ఎదురెదురుగా ఈ రెండు వాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో మొదటి కారు డ్రైవర్ విజయవాడ యనమలకుదురుకు చెందిన పి.నాగేశ్వరరావు (38) మృతి చెందాడు. నలుగురు మహిళలు తీవ్రగాయాలపాలై స్పృహ తప్పి పడిపోయారు. పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని వాహనంలో జీజీహెచ్‌కు తరలించారు. సీఐ వాసు, సిబ్బంది సహకారంతో నాగేశ్వరరావును మృతదేహాన్ని బయటకు తీశారు. మరో వాహనంలో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి ప్రమాదం జరగలేదు. వారంతా పెదకూరపాడు ఎమ్మెల్యేకు చెందిన బంధువులుగా సమాచారం. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కె.వాసు తెలిపారు.

ఇంటికి చేరేలోపే మృత్యువాత

బల్లికురవ: పింగాణీ పరిశ్రమలో పనిచేస్తూ డ్యూటీ ముగించుకుని బైక్‌పై ఇంటికి వస్తున్న యువకుడిని, సుబాబుల్ కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ ఢీ కొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఈ ఘటన మంగళవారం అర్ధరాత్రి చెన్నుపల్లి-అనంతవరం ఆర్ అండ్‌బీ రోడ్డులోని వేమవరం గ్రామంలో జరిగింది. అందిన సమాచారం ప్రకారం.. బల్లికురవ పంచాయతీలోని కొండాయపాలెం గ్రామానికి చెందిన పూరిమెట్ల శ్రీనివాసరావుకు ఇద్దరు కుమారులు, ఓ కుమార్తె. పెద్ద కుమారుడు వెంకటేష్ బార్బర్ షాప్ నిర్వహిస్తూ జీవనాన్ని వెళ్లదీస్తున్నారు. రెండో కుమారుడు గోపీకృష్ణ (30) ఎంబీఏ వరకు చదువుకున్నాడు. వేమవరం గ్రామ సమీపంలోని పింగాణీ పరిశ్రమలో పనిచేస్తున్నాడు. డ్యూటీ ముగిసిన తదుపరి ఇంటికి వెళుతుండగా వేమవరం నుంచి చిలకలూరిపేట వైపు సుబాబుల్ కర్ర లోడుతో వెళుతున్న ట్రాక్టర్ డోర్లు విడిచి వస్తోంది. అది అకస్మాత్తుగా ఢీకొట్టడంతో మార్జిన్ అర్థం కాక గోపీకృష్ణ బైక్ పైనుంచి కిందపడి అక్కడికక్కడే మృతిచెందాడు. అరగంటలో ఇంటికి చేరేలోపే ఈ ప్రమాదం సంభవించడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. గోపీకృష్ణకు భార్య, మూడేళ్ల బాబు ఉండగా.. ప్రస్తుతం భార్య నిండు గర్భంతో ఉంది. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.